నిరుపయోగంగా నున్న లోకల్ బైపాస్

- కూటమి ప్రభుత్వ హయాంలో రోడ్డుకు గ్రహణం
- రహదారికి పగుళ్లు
- రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన వైనం

విజయవాడరూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రోడ్లకు మహర్దశ పడుతుందని ప్రగల్భాలు పలికిన నాయకుల మాటలు నీటి మీద రాతలయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం దాటినా నున్న లోకల్ బైపాస్ రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన నున్న లోకల్ బైపాస్ రోడ్డు నిరుపయోగంగా మారింది. విజయవాడ-నూజివీడు ఆర్అండ్బీ రహదారిలో నున్న గ్రామంలో ఏర్పాటు చేసిన మామిడి కాయల మార్కెట్ కారణంగా ఇతర జిల్లాల నుంచి వచ్చే మామిడి కాయల వాహనాల నేపథ్యంలో తరుచుగా ట్రాఫిక్ సమస్య జఠిలమైంది. ఆ ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు సుమారు 35 ఎకరాల వ్యవసాయ భూములను 2015 లో అప్పటి ప్రభుత్వం సేకరించింది. ఎకరానికి 6 లక్షల రూపాయల చొప్పున రైతులకు చెల్లించింది. 10/6 నుంచి 16వ కిలో మీటరు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టింది. మామిడి కాయల మార్కెట్కు వచ్చే వాహనాలతో పాటు భారీ వాహనాలు, నాన్స్టాప్ బస్సులు, కాలేజి బస్సులు నున్న గ్రామంలోనికి రాకుండా లోకల్ బైపాస్ రోడ్డులో వెళ్లి రామచంద్రపాలెం అడ్డ రోడ్డు వద్ద నూజివీడు మెయిన్రోడ్డు ఎక్కే విధంగా నిర్మించారు. అందుకు గాను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 10.52 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. రోడ్డు నిర్మించిన అనతి కాలంలోనే నాణ్యత లోపం కారణంగా రోడ్డు మధ్యలో భారీగా కుంగి పోవడం, పగుళ్ళు ఏర్పడి వాహనాల రాకపోకలకు వీల్లేకుండా మారింది.

గొల్లపూడి కాల్వ, నయారా పెట్రోల్బంక్ సమీపంలో రోడ్డు పై పెద్ద పెద్ద గోతులు పడి వాహనాల రాకపోకలు లోకల్ బైపాస్ రోడ్డులో ఆగిపోయాయి. నున్న గ్రామంలో నుంచి వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. గ్రామంలో మళ్లీ ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రతి రోజూ వాహనాలు నిలిచిపోతున్నాయి.


రోడ్డు మధ్యలో పగిలి పోయిన లోకల్ బైపాస్ రోడ్డు

నిత్యం ట్రాఫిక్ జామ్తో ఇక్కట్లు...

కాలేజి బస్సులు వెళ్లే సమయంలో, తిరిగి వచ్చే సమసయాల్లో అయితే చెప్పనక్కరలేదు. తప్పనిసరి పరిస్థితిలో కొన్ని వాహనాలు రామచంద్రపాలెం అడ్డ రోడ్డు నుంచి నేరుగా సుబ్బారెడ్డి బార్ జంక్షన్ నుంచి గుణదల రోడ్డుకు, అక్కడ నుంచి కండ్రిక జంక్షన్కు వెళ్లి విజయవాడ వెళుతున్నాయి. లోకల్ బైపాస్ రోడ్డులో వెళ్లాల్సిన వాహనాలు నున్న-గుణదల రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నాయి. దీని వలన మ్యాంగో మార్కెట్ నుంచి సుబ్బారెడ్డి బార్ వరకు రోడ్డు ఆక్రమణలకు గురి కావడంతో ఆ రోడ్డు పూర్తిగా మూసుకుపోయే ప్రమాదం ఏర్పడింది. ఆర్అండ్బీ శాఖ ఆ రోడ్డు ఆక్రమణలు తొలగించి రోడ్డుకు మరమ్మతులు చేసినట్టయితే ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. రామచంద్రపాలెం అడ్డరోడ్డు వరకు రోడ్డుకు మరమ్మతులు చేసినట్టయితే నూజివీడు ఆ పై ప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనాలు నున్న గ్రామంలోకి ప్రవేశించకుండా నేరుగా ప్రయాణం కొనసాగిస్తాయి. భారీవాహనాలు నూజివీడు, సత్తుపల్లి, ఏలూరు, ఆ పై ప్రాంతాలకు వెళ్లే వాహనాలను లోకల్ బైపాస్ రోడ్డులోకి డైవర్షన్ అయ్యే విధంగా ఆర్అండ్బీ శాఖ తగిన సూచక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రోడ్డుకు మరమ్మతులు చేసే విషయంలో ప్రజాప్రతినిధులు శ్రద్ధ తీసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని నున్న గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లోకల్ బైపాస్ రోడ్డు ఎంట్రన్స్ లో కొందరు ఆక్రమించుకొని వినాయకుని బొమ్మలతో వ్యాపారాలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఆక్రమణలను ఖాళీ చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆక్రమణల కారణంగా వాహనాలను రోడ్డు పైనే పార్కు చేస్తుండటంతో వాహనాల రాకపోకలకు అసౌకర్యం కలుగుతుంది.


గుంతలు ఏర్పడిన దృశ్యం


సుబ్బారెడ్డి బార్ జంక్షన్లో ట్రాఫిక్

ఆక్రమణలు తొలగించాలి



లోకల్ బైపాస్ రోడ్డును ఆర్అండ్బీ శాఖ మరమ్మతులు నిర్వహించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రజలు రోడ్డుపై నడవాలంటే భయపడుతున్నారు. రోడ్డు ఆక్రమణలు తొలగించాలి.

–దండు సుబ్రహ్మణ్యం రాజు, నున్న

అధికారులు స్పందించాలి



నున్న గ్రామంలో వాహనాల రాకపోకలు పెరిగి, ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమవుతుంది. సంబంధిత శాఖలకు చెందిన అధికారులు స్పందించి తక్షణమే ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఉంది.

–పి. శ్రీమన్నారాయణ, నున్న

క్లుప్తంగా

టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



పెనమలూరు: టీబీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రాజా అన్నారు. పోరంకిలోని 4వ సచివాలయంలో ప్రధాన మంత్రి టీబీ ముక్తి భారత్ కార్యాక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజా మాట్లాడుతూ వారం రోజులుగా క్లైతో దగ్గు ఉన్న వారు పరీక్ష చేయించుకోవాలని సూచించారు. 60 సంవత్సరాలు పైబడిన వారు షుగర్ ఉన్నా, కళ్లి వస్తున్న వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. శరీర బరువు తగ్గినా, రోగ నిరోధక శక్తి తగ్గినా టీబీ వ్యాధి సోకే ప్రమాదముందని స్పష్టం చేశారు. మండల పరిధిలో 72 మంది టీబీ వ్యాధి గ్రస్తులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మందులు సకాలంలో వాడితే టీబీ వ్యాధి తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాకాలకు ఉత్తమ సహజ వైద్యుడిగా అవార్డు



పెనమలూరు: కానూరుకు చెందిన యోగాసాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాకాల సత్యనారాయణకు ఉత్తమ సహజ వైద్యుడి అవార్డు వచ్చింది. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై ఉత్తమ సహజ వైద్యుడిగా మాకాల సత్యనారాయణకు అవార్డు చైన్నైలో లయన్స్ డిస్ట్రిక్ ఫస్టు గవర్నర్ రాజేష్ ఎం.జోషి ప్రదానం చేశారు. మందులు వాడకుండా, ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెజర్, యోగా శక్తి తదితర సహజ వైద్య సేవలతో మాకాల సత్యనారాయణ వ్యాధులు తగ్గటానికి ఎనలేని కృషి చేసినందుకు అవార్డు పొందారు. ఈ కార్యక్రమంలో చెన్నై ఆయుష్ క్లబ్ పాలన అధికారి డాక్టర్ అగత్యార్, పలువురు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు ఇచ్చిన మధ్యాహ్న భోజన కార్మికులు



ఉంగుటూరు(గన్నవరం): మండల కేంద్రమైన ఉంగుటూరు ఎంపీడీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ నెల 9వ తేదిన జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొంటున్నట్లుగా నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘ మండల కార్యదర్శి షేక్ మహబూబీ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల కనీస వేతనం రూ. 20 వేలు చెల్లించాలని, పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సంఘ నేతలు సీహెచ్. లక్ష్మీ, చంటి, అన్నపూర్ణ, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు రిక్షాలు కొనుగోలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో చెత్త సేకరణకు గాను 11 రిక్షాలు కొనుగోలు చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి కోట సురేష్బాబు తెలిపారు. ప్రతి ఇంటికెళ్లి చెత్త సేకరించి ఒక చోట డంప్ చేసేందుకు వీలుగా రిక్షాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. గ్రామానికి మరో 20 రిక్షాలు అవసరమవుతాయని చెప్పారు.

కాలువలో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం

పెనమలూరు: వ్యక్తి వేధింపుల కారణంగా వివాహిత పంట కాలువలో దూకిన ఘటన పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వవరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన వివాహిత డొంక రోడ్డులో ఉంటున్న తల్లి ఇంటికి తరచుగా వెళ్లేది. ఈ నేపథ్యంలో అక్కడ హఫీజ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. వివాహిత ఫోటోలు హఫీజ్ తీసేవాడు. కాగా ఆమెను తనతో కలిసి జీవించాలని లేని పక్షంలో ఫొటోలు సోషల్ మీడియాలో పెడతానని హఫీజ్ బెదిరించాడు. అతని తల్లి మున్నీ కూడా కొడుక్కి సహకరించింది. వేధింపులను భరించలేక యనమలకుదురు చిన్న వంతెన వద్ద బందరు కాలువలో మంగళవారం రాత్రి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆమె భర్త కాపాడాడు. ఈ ఘటన పై బాధితురాలు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వంతెన ప్రతిపాదనను పరిశీలించిన కలెక్టర్

పెనమలూరు: తాడిగడప-పోరంకి గ్రామాలను అనుసంధానం చేయటానికి ప్రతిపాదించిన వంతెన స్థలాన్ని, ప్లాన్ను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం పరిశీలించారు. పోరంకి సెంటర్ నుంచి డొంక రోడ్డు మీదగా బందరు కాలువ పై వంతెన నిర్మాణం చేస్తే ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి మార్గం సుగమం అవుతుందని వంతెన ప్రతిపాదనలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేశారు. అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన కూడా చేశారు. టీడీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణం చేయలేదు. కాగా ఇప్పుడు అదే ప్రాంతంలో వంతెన నిర్మాణం చేయాలని ప్రతిపదన వచ్చింది. దీంతో కలెక్టర్ బాలాజీ వచ్చి పరిశీలించారు. వంతెన నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్, తహసీల్దార్ గోపాలకృష్ణ, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకర రావు, కోయా ఆనంద్ప్రసాద్ పలువురు పాల్గొన్నారు.


తాడిగడప వద్ద వంతెన ప్లాన్ను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

కంకిపాడు: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9వ తేదీన చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని మండేపూడి భవన్లో బుధవారం ప్రజా సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కౌలురైతులను గుర్తించటం లేదని విమర్శించారు. సాగులో 80 శాతం సాగు కౌలురైతుల చేతుల్లో ఉందన్నారు. పిఎం కిసాన్ పథకాన్ని కౌలు రైతులకు వర్తింప చేసి సాగుకు చేయూత అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శివనాగేంద్రం మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కటం లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తానని ఇచ్చిన వాగ్దానాన్ని పాలకులు అమలు చేయకుండా తాత్సార్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సీలం నారాయణరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్రం వ్యవసాయ కూలీలను రోడ్డుకు లాగే యత్నం చేస్తుందని విమర్శించారు. సంవత్సరానికి 200 రోజులు ఉపాధి కల్పించాలని, రోజు కూలీ రూ.600 అందించాలని కోరారు. అన్ని వర్గాల సమస్యలపై చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మరీదు సురేష్బాబు, నాయకులు షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడులు

కంకిపాడు: మేలైన యాజమాన్య చర్యలతో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ కె.జ్యోతిరమణి అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు, దావులూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వెలివెల ఉషారాణి బాబూరావు నేతృత్వంలో అధికారుల బృందం ఆయా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. జ్యోతి రమణి మాట్లాడుతూ విత్తనం దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకూ మేలైన యాజమాన్య చర్యలు చేపట్టాలని సూచించారు.


ప్రొద్దుటూరులో వరి నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారుల బృందం, రైతులు

యువకుడి ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు

గన్నవరం: ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మెట్లపల్లి గ్రామ శివారులో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల సమాచారం ప్రకారం.. మెట్లపల్లి గ్రామ పరిధిలోని బ్రహ్మయ్య లింగయ్య చెరువు గట్టుపై ఓ యువకుడి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి ఆత్కూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సురేష్ నేతృత్వంలోని సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కనే పురుగుల మందు డబ్బా, కూల్డ్రింక్స్ బాటిల్ ఉండడం పోలీసులు గుర్తించారు. అక్కడే ఉన్న మోటర్ బైక్, సెల్ఫోన్ ఆధారంగా మృతుడు మండలంలోని గోపవరపుగూడెంకు చెందిన కనికంటి హరినాథ్(30)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఇంటి నుంచి మంగళవారం ఉదయం వెళ్లిన హరినాథ్ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలిస్తున్నట్లుగా కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. హరినాథ్ నడిపే పురుగుల మందు వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పుల పాలై మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంచవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతుడి తండ్రి రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇంకా వివాహం కాలేదు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

హనుమాన్జంక్షన్ రూరల్: భవన నిర్మాణ కార్మికుల సంఘం బాపులపాడు మండల అధ్యక్షుడిగా చందు నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజనాల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. స్థానిక నూజివీడురోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు సమక్షంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చందు నరసయ్య, ఉపాధ్యక్షులుగా బేతాళ ప్రసాద్, నీరుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రాజనాల సురేష, సహాయ కార్యదర్శి స్వర్ణ కిరణ్, కోశాధికారిగా ఎ.రాము, మరో 16 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పాత లేబర్ చట్టాలను పునరుద్ధరించాలని నల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు.


సమస్యలు పరిష్కరించాలని వినతి

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురంలోని పైపులరోడ్డు వద్ద సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సర్పంచ్ జి.సీతయ్య అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. వర్షాలు కురుస్తుండటంతో రోడ్లు లేక బురదలోనే నడుస్తున్నామని ఒకటో వార్డు ప్రజలు తెలిపారు. వేసవి కాలం నుంచి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రోడ్లు లేక బురదలో వృద్ధులు, చిన్నపిల్లలు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. కనీసం రబ్బీష్ రోడ్లు నిర్మించాలని కోరారు. వాటర్ ట్యాంక్ నిర్మించి మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ప్రతి కుటుంబం ఆర్వో ప్లాంటు నుంచి తాగునీరు కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలన్నింటికీ ప్రాధాన్యత ప్రకారం పరిష్కరిస్తామని సర్పంచ్ సీతయ్య తెలియచేశారు. సమావేశంలో పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాతపాడు గ్రామంలో ఆర్వో ప్లాంటు నిర్మించాలి....

పాతపాడు గ్రామంలో ఫిల్టర్ బెడ్స్ నిర్మించి శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామ ఉపసర్పంచ్ మరీదు స్వప్న అధ్యక్షతన పాతపాడు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సభ నిర్వహించారు. ఇసుక ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరారు. అదే విధంగా బీసీ కాలనీలో బావి నుంచి సరఫరా చేస్తున్న నీటి వల్ల దురదలు వస్తున్నాయని అక్కడ ప్రత్యేకంగా బోరు నిర్మించి నీరు సరఫరా చేయాలని కోరారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు వేతనాల చెల్లింపులు జరగడం లేదని కూలీలు తెలియచేశారు. పనులకు సక్రమంగా రాని వారి పేరున బ్యాంకుల్లో వేతనాలు జమ జరుగుతున్నాయని దేవర నాగేశ్వరరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. సమస్యలను పరిష్కరించే దిశగా పంచాయతీ పాలక వర్గం ప్రణాళిక సిద్ధం చేస్తుందని కార్యదర్శి పి.కోటిలింగమ్మ తెలిపారు. పి.నైనవరం గ్రామ సర్పంచ్ బట్టా సోమయ్య అధ్యక్షతన గ్రామసభ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగింది. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని గ్రామస్తు కోరారు. పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించాలని ప్రజలు కోరారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు తేజోన్మయి ఎంపిక



గన్నవరం: జాతీయ స్థాయి ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలకు స్థానిక చైతన్య స్పోర్ట్స్ క్లబ్కు చెందిన కోట తేజోన్మయి ఎంపికై నట్లు ఆ క్లబ్ ప్రధాన కార్యదర్శి ధనియాల నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలోని మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-12 విభాగంలో తేజోన్మయి కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్లో ఈ నెల 5వ తేదీ నుంచి జరిగే జాతీయ పోటీల్లో తేజోన్మయి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు క్రీడా ప్రముఖులు అభినందించినట్లు నాగరాజు తెలిపారు.

ఉప్పాడ త్రిమూర్తులుకు నివాళి

పెనమలూరు: నిస్వార్థంగా సేవలు అందించే వాడే అసలైన నాయకుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు ఉప్పాడ త్రిమూర్తులు సంస్మరణ సభ బుధవారం పోరంకి కిలారు అనీల్ ఎస్టేట్లో మండల సీపీఎం కార్యదర్శి షేక్.కాశిం అధ్యక్షతన నిర్వహించారు. తొలుత దివంగత సీపీఎం నేత ఉప్పాడ త్రిమూర్తి చిత్రపటానికి వివిధ పార్టీ నేతలు, ప్రజా సంఘాల నేతలు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాయకులు ప్రజల పక్షాన ఉంటేనే ఆ నాయకుడికి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాదాల వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, టీడీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రి రావు, కాంగ్రెస్ నాయకుడు వెలిశిల సుబ్రహ్మణ్యం, సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి నరసింహారావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. పోరంకి సబ్స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. దీంతో విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. దీని కారణంగా ఏవీఎం గార్డెన్స్, చేవలకుండీ, బందరు రోడ్డు, సిద్దిక్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. స్థానికులు సహకరించాలని కోరారు.

నేడు శ్రీసత్యసాయిబాబా ప్రేమరథం శోభాయాత్ర

పెనమలూరు: శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం శోభాయాత్ర నిర్వహిస్తున్నామని శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ వి.మోహన్రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం వివరాలు తెలుపుతూ శ్రీసత్యసాయి ప్రేమరథం జ్యోతి భజనల ముగింపు సందర్భంగా గురువారం పెనమలూరు సత్యసాయి సేవా మందిరం వద్ద నుంచి యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు యనమలకుదురుకు యాత్ర చేరుకుంటుందని పేర్కొన్నారు.

4న వికాస్లో సదస్సు

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 4వ తేదీన మేధాశక్తి హక్కులు, పేటెంట్లపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు ఎటువంటి రుసుము చెల్లించకుండా సదస్సులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నాగపూర్ కు చెందిన అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్ అండ్ డిజైన్ కుమార్ రాజు ప్రసంగిస్తారని తెలిపారు. పేటెంట్ కోసం పరిశోధకులు ఏ విధంగా అభ్యర్థనలు చేసుకోవచ్చో సోదాహరణముగా వివరిస్తారన్నారు. ఇప్పటి వరకు 500 మంది వివిధ కళాశాలల నుంచి హాజరయ్యేందుకు వివరాలను నమోదు చేసుకున్నారని చెప్పారు.

వంశీమోహన్ విడుదలతో పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు

గన్నవరం: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఇబ్బడిముబ్బడిగా పెట్టిన అక్రమ కేసులను ఒక్కొక్కటిగా ఛేదించుకుంటూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ జైలు నుంచి బయటకు వచ్చారు. నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బుధవారం మధ్యాహ్నం విజయవాడ జిల్లా జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. వంశీమోహన్కు సంఘీభావం తెలిపేందుకు నియోజకవర్గానికి చెందిన వేలాది మంది వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు తరలివెళ్లారు. ఆయన వాహనాన్ని అనుసరిస్తూ విజయవాడ నుంచి నూజివీడు కోర్టుకు, అక్కడి నుంచి వీరవల్లి మీదుగా తేలప్రోలు వరకు బైక్లు, కారుల్లో వచ్చి అభిమానాన్ని చాటుకున్నారు.

జైలు నుంచి విడుదలైన వంశీమోహన్ నూజివీడు వెళ్లి అక్కడి కోర్టుకు హాజరైన తర్వాత వీరవల్లి మీదుగా తేలప్రోలు చేరుకున్నారు. వంశీమోహన్ వెంట ఆయన సతీమణి పంకజశ్రీ, పలువురు పార్టీ ముఖ్య నేతలు ఉన్నారు.

వల్లభనేని వంశీకి జంక్షన్లో ఘన స్వాగతం

హనుమాన్జంక్షన్ రూరల్: అక్రమ కేసుల్లో అరెస్ట్ అయి బెయిల్పై విడుదలయిన వైఎస్సార్ సీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి హనుమాన్జంక్షన్లో ఆ పార్టీ శ్రేణులు బుధవారం ఘన స్వాగతం పలికారు. నూజివీడు నుంచి హనుమాన్జంక్షన్ మీదగా తేలప్రోలులోని నివాసానికి వెళ్లుతున్న ఆయనకు భారీ ర్యాలీతో ఎదురేగి స్వాగతం పలికారు. జై జగన్, జై వంశీ అంటూ యువత నినాదాలు చేశారు. హనుమాన్జంక్షన్ కూడలి వద్ద కార్యకర్తలకు కారులో నుంచే వల్లభనేని వంశీ అభివాదం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వంశీ కాన్వాయ్తో తేలప్రోలు వరకు వెళ్లారు.


తేలప్రోలులో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న వంశీమోహన్

అవగాహనతో విద్యుత్ ప్రమాదాల నివారణ

ఉయ్యూరు: విద్యుత్ ప్రమాదాలను అవగాహనతోనే నివారించవచ్చని ఆ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ అన్నారు. జాతీయ విద్యుత్ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఉయ్యూరులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కృష్ణనాయక్ మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ లైన్లు తెగిపడటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ పరికరాల వినియోగం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉంటే ప్రమాదం దరిచేరదని చెప్పారు. సౌరవిద్యుత్ వినియోగంతో విద్యుత్ ఆదా, వృథాను అరికట్టవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ వాహనాల వినియోగం దేశ ప్రగతి దోహదపడుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో డీఈఈ హేమకుమార్, ఏఈ బసవ శాస్త్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ విద్యుత్ వారోత్సవాల ర్యాలీలో మాట్లాడుతున్న ఈఈ కృష్ణనాయక్

సైడు డ్రెయిన్లలో పూడికతీత

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగించడంతో పాటు సైడు డ్రెయిన్లు బుధవారం పూడికతీశారు. సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లు గుర్తించి మురుగునీరు సజావుగా పారుదల అయ్యేందుకు పారిశుద్ధ్య సిబ్బందిచే చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా ప్రతి రోజు వేకువజాము నుంచే పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని చెప్పారు. గ్రామంలో సెయింట్ ఆన్స్ పాఠశాల రోడ్డు, వాటర్ ట్యాంక్ బజారు, రవీంద్ర భారతి పాఠశాల రోడ్డు, ఎస్సీ కాలనీ, కాల్వగట్టు ప్రాంతాల్లో చెత్తను తొలగించినట్లు తెలిపారు. పారిశుద్ధ్యంపై సమస్యలు ఏమైనా ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటె Canara Bank, ... [illegible]

[illegible]

Vijayawda,
Dt.02/07/2025.

ఇట్లు:-
పేర్ని నాగ పవన్ కుమార్ ... [illegible] ... ఫోన్ : 9885103119,